

కథా కౌముది

# బహుమతి సునేత్ర

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

**ఏదో తెలియని బాధ,** ఇదే కారణం అని చెప్పలేని ఒంటరితనం, ఎవరిమీదో కసి, కసికి కారణం తెలిసినా, కసి అవసరమా అని మనసులోనే తర్కం, మానవ బంధాలు మనిషి అనిశ్చల మనసుకు ముడిపడి ఉండకూడదు అని గట్టిగా నమ్మే మనస్తత్వం. మనస్తత్వానికీ, వాస్తవానికీ మధ్య జరిగే ఘర్షణ ఒక్కోసారి వింత ఆలోచనలను పుట్టిస్తే, ఒక్కోసారి మనకే తెలియని కొత్తదారిలోకి అడుగుపెట్టిస్తుంది.

ఛా! ఏంటీ ఈ చెత్త చెత్త ఆలోచనలు, మనసు ఎందుకు ఇలా గింజుకుంటుంది? ఇక లాభం లేదు, ఈ మనసుని ఎటో ఒకవైపుకి మళ్ళించాలి అనే ప్రయత్నం దేనికోసమో ఈ మనసు ఆశపడుతున్నట్లుంది, ఏదో కొత్త అనుభూతి కోసం మనసు పాకులాడుతున్నట్లుంది.

ఎవరిదైనా ఒక ఆత్మీయతతో కూడిన స్వరం నన్ను పరామర్శించాలనే చిన్ని ఆశ మొదలయ్యింది, కానీ, అవేవి సాధ్యంకానివి, జరగనివి అని మనసుకు బాగా తెలుసు. ఇలాంటి సందర్భాల్లో ప్రత్యామ్నాయం వెతుక్కోటం మనిషికి బాగా తెలిసిన విద్య. నేను అప్పుడప్పుడూ రాసుకున్న పిచ్చి రాతల పుస్తకాలని ఆశ్రయించాను. రాసుకున్న పిచ్చి రాతలలో ఏదైనా ఒక ఊరట కలిగించగలిగే రాత దొరుకుతుందేమో అనే ఆశతో వెతికాను. నా వెతుకులాట, నేను రాసుకున్న పిచ్చి రాతల్ని చూపటంఏమో కానీ, నా తలరాతని మార్చేస్తుందని ఊహించలేకపోయాను.

ఆ పుస్తకాల మధ్య ఒక చిన్న కాగితం, మడిచి పెట్టి ఉంది. తెరిచి చూసాను. కొన్ని వరసల అక్షరమాల కనిపించింది. నా కళ్ళు అక్షరమాలని ఒక్కసారి పైనుండి క్రిందివరకూ స్కాన్ చేశాయి. ఒక్క క్షణం పాటు, నాలో ఒక చిన్న అనుమానం. అవి నేను రాసినవా? అలా లేదే, అలాంటి పదాలు నేను రాయలేనే. ఎందుకో రాసిన శైలి నాదిలా అనిపించినా, అందులోని పదాలమాల నాది కాదేమో అనిపించింది. ఆగిపోయి, మళ్ళీ మళ్ళీ చదివాను. చదివిన ప్రతిసారి, ఇది నా రచనకాదు అని అర్థమౌతూనే ఉంది. ఆలోచనా తరంగాలు ఒక్కసారిగా మస్తిష్కంలో దాచిన కొన్ని పేర్లు పరిశీలించే ప్రయత్నం చేశాయి. ఒక్కసారిగా ఒక మనిషి రూపం, ఆ రూపంలో నాకు ఎంతో ఇష్టమైన చిరునవ్వు తళుక్కున మెరిసాయి. నాకే తెలియకుండా నా పెదవులపై ఒక చిరునవ్వు. జ్ఞాపకం వచ్చింది, కొన్ని నెలల క్రితం ఆ చిరునవ్వు నన్నెలా వశీకరించిందో, ఆ వశీకరణకి భయపడి నేనెలా ఆ మనిషి ఉనికిని తప్పించుకునే ప్రయత్నం చేసానో, నా ఆలోచనలు, ఆ చిరునవ్వుతో నాకున్న పరిచయ చరిత్ర వైపుకి దిశ తిరిగాయి.

నా ఊహాలోకాల్లో నేను ఉండగా, నా ఫోన్ నుండి చిన్న ప్రకంపన. నా ఫోన్ ట్రింగ్‌మని శబ్దతరంగాలని పంపించింది. అన్యమస్కంగానే మెసేజ్ చదివాను కానీ, అది నా ప్రశ్నకి బదులవుతుందని ఊహించలేకపోయాను.

'హాయ్' అన్న మెసేజ్ ఆశ్చర్యపరచలేదు. కానీ పంపిన మనిషి పేరు మాత్రం ఒక్క క్షణం పాటు నన్ను స్తంబింపచేసింది. ఫ్రీజ్ అవ్వటం అంటే ఇదేనేమో అనిపించేలా చేసింది. ఇది నిజమేనా? నన్ను నేనొకసారి గట్టిగా గిల్లుకున్నాను. వెతుకుతున్న ప్రశ్నకి జవాబు ఈవిధంగానా? ఊహించని ఉత్సాహం నన్ను ఆక్రమించుకుంటుంది అని నాకే తెలిసిపోతున్న విచిత్రమైన వణుకు. (ఇన్ని రోజులు పట్టించుకోనట్లు నటించింది నీకు మాత్రమేగా తెలుసు. భయపడతావెందుకు? నా ఆత్మ నాకు ఇస్తున్న ధైర్యం) అది సరే, ఆలోచిస్తూ సమయం వృధా చేస్తే ( నాకు నేనే ఇచ్చుకున్న వార్నింగ్) ఒక వేళ ఈసారి పలకకపోతే పూర్తిగా నా పేరు డిలీట్ చేసేస్తాడేమో? అవును మరి ఎన్నిసార్లు పలకరించినా ఇగ్నోర్ చేస్తూ ఉంటే, ఎవరు మాత్రం వెనకపడతారు వదలకుండా? మనసులో పలకరించనా ఒద్దా అనే సంకోచం. భయంతో కూడిన బెరుకుతనం. కానీ మనసు ఇప్పుడు ఉన్న పరిస్థితికి తన చిరునవ్వు ఎంత స్వాంతనని ఇవ్వగలదో తెలుసు.

'హాయ్' అని బదులు ఇచ్చేసాను. ఇంతకీ నా మనసులో ఆగిన నా ప్రశ్న ఇది రాసింది ఎవరు? అదే నా ప్రశ్న. దానికి సమాధానం ఆ అక్షరమాలకి యజమాని అతనే, అతనే నన్ను ఇప్పుడూ పలకరించింది. ఇది కలయో, వైష్ణవమాయో అనిపించిందొక క్షణం.

"కాసేపు ఆగిపో ఏమవుతుంది,
కడదాకా ఉండిపో కథ పూర్తవుతుంది..
నాలుగు కాలాల బండి కదులుతూనే ఉంటుంది,
నిజం అవ్వని కలలను రేపుతూనే ఉంటుంది.

కాలం మాయ హాయిగానే ఉంటుంది,

సుఖ దుఃఖాల సమ్మిళితమే అయినా,

కాసేపటిలో కొత్త కథ మొదలవుతుంది,

కాసేపు ఆగిపో కడదాకా ఉండిపో..."

ఇది రాసింది ఎవరో కాదు AC అందమైన చిరునవ్వు ( నాకు నేనిచ్చుకున్న షార్ట్ కట్ పేరు AC (A– అందమైన C – చిరునవ్వు)

కాసేపు కాదు పూర్తిగానే ఆగిపోయింది నా గుండె. కథ మొదలవుతుందో లేదో, ఏదో మొదలవ్వాలని కోరుతోంది నా మనసు. కడదాకా ఉండగలనో లేదొ, ఈ కొంతసేపైనా చాలు అనిపిస్తుంది ఈ క్షణం. నిజమవ్వని కలలు అని ఎందుకు రాశాడో తెలీదు. కలగా మిగిలిపోవాల్సిందే తప్ప ముందుకు వెళ్ళలేని స్థితి అని మాత్రం తెలుసు. కానీ, నాలో నిజమవ్వని కల మాత్రం ఒకటి అలాగే నిలిచిపోయింది ఇన్నాళ్ళూ. ఆ కలని తప్పించుకునే తిరిగాను ఇన్నాళ్ళూ, ఆ కల నిజం అవ్వకూడదని కూడా తెలుసు నాకు. కాసేపటిలో కొత్త కథ మొదలవుతుందట.

నిజమే నాలో మాత్రం ఏదో కొత్త అలజడి మొదలయ్యింది. నీ కలని నిజమవ్వనీ అని ప్రేరేపిస్తున్నట్లున్నది. కొత్త కథకి మొదలు ఇదేనేమో అనిపిస్తున్నది. కొన్ని క్షణాలపాటు ఆగిపోయిన ఈ కథను ఇక సాగనివ్వమంది మనసు. నిలిచిపోయిన నా కథకి మొదలు ఏంటో చెప్పింది నా గుండె.

అందుకే మాటా మాటా కలిపాను. నేను పలకరించిన ప్రతిసారి ఎందుకు నన్ను తిరిగి పలకరించలేదు అని అతనడిగిన ప్రశ్నకి నా మౌనానికి కారణాలేవో వెతికాను, తన కవితలోని లోతైన అర్థాన్ని నాకన్వయించుకుని చెప్పాను. నేనిచ్చిన బదులు తనని తృప్తి పరచకపోయినా, ప్రేమ నిండిన గొంతుతో నా యోగక్షేమాలు అడిగాడు. అతను నన్ను పలకరించిన ఆ కంఠధ్వనిలో పూర్వ జన్మ తాలూకు ఆనవాళ్ళేమో అని భ్రమించేలాంటి ప్రేమాభిమానం తొంగి చూసినట్లు నాకొక ఆలాపన. అది నిజమో కాదో తెలియదు కానీ, మా సంభాషణలకి ఫుల్‌స్టాప్ పెట్టాలనే కోరిక మాత్రం ఇరువురిలోనూ కలుగలేదు. తనలో ఏదో వెలితి, నాలో ఏదో తపన. తనకి జరుగుతున్నది అలుపెరుగని అన్వేషణ అన్నాడు.

నాలో అన్నీ దొరికాయేమో, ఇంతకు మించిన ఆనందం లేదేమో, అని సర్దుకుపోయి బ్రతికేస్తున్న జీవితం. సర్దుకుపోయి బ్రతకటమనే నా ఆలోచన తప్పు అని చెప్పకనే చెప్పిన అతని మాటలు.

ఇద్దరివీ రెండు వేరు వేరు గమ్యాలు, ఇద్దరివీ రెండు అనిశ్చల హృదయాలు. ఇద్దరివీ అగమ్య గోచరమేనా ఈ జీవితం అనిపించిన క్షణాలు, ఇద్దరిలోనూ ఆత్మీయతని వెతుకుతున్న దాహం తీరని మనసులు. మాటా మాటా కలిపాము. అతనిలోని కవి నా మనసునెలా తాకాడో వివరించేసాను. తన కవితలలో సారాంశాన్ని అర్ధం చేసుకుని, తనలోని కవిని ప్రేరేపించగలిగే ఒక హృదయం కోసం తన మనసెలా తాపత్రయపడుతుందో, అతనూ వివరించాడు. ఆనందం ఇద్దరి మనసులో ఇంకా చోటులేదన్నంతగా నిండిపోయిందని మా మాటల ప్రవాహానికి మాత్రమే తెలుసు.

'నీలోని కవిని నాకు చూపిస్తావా?' అన్నాను. అతనిలోని కవి ఉప్పొంగి తరంగమై నన్ను ముగ్ధ మనోహర వీధుల్లోకి విహారానికి నడిపించాడు. తను రాసిన కవితలు చాలా ఉన్నాయి చదవమన్నాడు, రాత్రంతా శివరాత్రిలా గడిపేశాను. ఒక్కొక్కటి ఒక్కొక్క ఆణిముత్యంలా అనిపించాయి. తన ఎదురుగా కూర్చుని, తన కంట్లో కళ్ళుపెట్టి తన సాహిత్యాన్ని తానే వల్లిస్తుంటే వినగలిగితే (ఇవే మరి కోరికలకు హద్దు ఉండదు అనటానికి పరాకాష్టలాంటి ఆలోచనలు అంటే) అయినా పిచ్చి మనసు కదా. అందుకే ఎంత అదృష్టమో కదా అని వాపోయింది నా మనసు.

అద్భుతాలకి రూపాలుంటాయా? వరాలకి ఖరీదులుంటాయా? ఎన్నో అద్భుతమైన పదమాలలకి యజమాని అతను, నా ఈ క్షణాలని మధురాతి మధుర క్షణాలుగా మార్చినందుకు, తిరిగి ఈ కవికి నేనేమివ్వగలను? పదావిర్భావ కర్త అయిన అతనికి నేను ఏమి చేయగలను? కొన్ని గంటలు క్షణాలుగా మారి, నాలోని నరాలు జీవచ్ఛవాలుగా స్థంభించిన వేళ నాలో నుండి వచ్చిన సమాధానం మాత్రం నువ్వనుకుంటే ఏమీ చేయలేవు? ఎందుకు చేయలేవు? నా ప్రశ్నకే తిరుగు ప్రశ్న వేసింది నా మనసు.

కొన్ని సందర్భాల్లో తర్కం మంచిది కాదు, అవకాశాలని కాలదన్నుతుంది. అందుకే నాకున్న అర్హతల గురించి తర్కించలేకపోయాను. అతనికవేమీ పట్టినట్లు లేదు. తనదైన చిరునవ్వుని చెదరకుండా కవితల మాలలతో నాకు అభిషేకం చేస్తున్నాడా? అనిపించేలా సమయం మమ్మల్ని పట్టించుకోలేదు, మేము సమయాన్ని పట్టించుకోలేదు. ఉదయం, సంధ్యా సమయం రెంటి రాకపోకలూ మాకు తెలియలేదు. నాకు తెలిసింది అతనిలోని అద్భుతమైన సాహిత్య సంపద, అతనికి తెలిసింది తనలోని సాహిత్యానికి విలువనిచ్చి అభిమానించగలిగే భక్తురాలు. తన కవితలన్నీ చదివిన నాలో ఒక తెలియని మధురానుభూతి, ఒక ప్రకల్పన, ఒక అనిర్వచనీయ నిశ్శబ్దం. అతనిలో నా కవితలని ఆలకించి అనుభవిస్తూ, నాలోని కవిని లోలోనే నర్తింపచేస్తున్న ఒక గొప్ప శ్రోత దొరికిందనే ఆనందం.

అతనిలోని కవి ఎటువంటి కవో తెలుసుకోవాలనే చిలిపి ఆలోచన. రాయాలి, నాకు రాయటం వచ్చు అని చెప్పుకోవాలని వంద పుస్తకాలని చదివి అందులోని కొన్ని పదాలని వల్లించుకుని రాసేవాళ్ళు కూడా కవులుగానే చెప్పుకుంటున్నారు ఈ రోజుల్లో ఒక మూల కూర్చుని అంతర్మధనం చేసి పదాలను కష్టపడి వెతికి రాసేవాళ్ళు కొందరు. కవిలో సహజమైన పదాల ఒరవడి ఉండాలి. ఏదైనా ఒక వస్తువుని చూసినప్పుడు తనలో దాన్ని గూర్చిన వర్ణన వెంటనే రాగలిగినప్పుడే కవి నిజమైన కవి అనేది నా భావన.

తనని పదాలతో కదిలించాలని నాలో కలిగిన చిలిపి ఆలోచనకి వెంటనే శ్రీకారం చుట్టేసాను. 'నేను కొన్ని పదాలు చెప్తాను. ఆ ఒక్కొక్క పదానికి ఆశువుగా నాలుగు లైన్లలో కవిత చెప్పగలవా?'

తన నుండి బదులు, పెద్దగా ఒక నవ్వు. 'అలాగే అడుగు' అంటూ నవ్వుతూనే ఉంటే, నా మనసులో మెదిలింది మాత్రం, అయ్యో ఆ నవ్వులోని సమ్మోహనానికి భయపడే ఇన్నాళ్ళూ నేను తప్పించుకుని తిరిగింది అని ఒక తియ్యని మూలుగు. ఆ నవ్వు విన్నంతసేపు ఆహ్లాదంగా అనిపించింది నా మనసుకి.

ఈ మనిషి నవ్వుతో నాకెక్కడో అనుబంధం ఉందేమో? అనే భావన మొదలైంది. నేను పదాల శోధనలో పడితే, తను కవితల అలలలో ఉప్పెనలా ఎగిసిపడుతున్న ఆనందంలో ఉన్నాడనే దానికి అతని మాటలు, నవ్వులే సాక్ష్యం.

సరిగ్గా ఈరోజుకి మూడు రోజులు. నేను తను మాట్లాడుకోవటం మొదలుపెట్టి. కాదు కాదు, తన కవితా వాహినిలో కొట్టుకుపోవడం నేను మొదలు పెట్టి అనాలి.

ఎన్నో భావాలు నాలో. నేనడిగిన ప్రతి భావానికి తన దగ్గర ఒక అక్షరమాల. మూడు రాత్రులు, నాలుగు పగళ్ళు ఎలా గడిచాయో తెలీలేదు. కానీ నాలోని ఆనందం, తియ్యని పద మాలల అలంకారం విని తరించే ఈ క్షణాలు మాత్రం రెండు దశాబ్దాల క్రితం, నాకై నేను కవితలు రాస్తూ, చదువు పక్కన పెట్టానని అమ్మ నన్ను తిట్టినా, ఎవరికీ తెలీకుండా దొంగతనంగా స్నేహితులకిచ్చి మ్యాగజైన్‌లకి పోస్ట్ చేయటాలు, అవి ప్రింట్ అయినప్పుడు చూసుకుని మురిసిపోవటాలు.. ఇవన్నీ, నేను రెండు దశాబ్దల క్రితం చేసిన తీపి జ్ఞాపకాలు. అప్పుడు నా కవితలని చూసి నేనే గర్వపడేదానిని. నా ప్రతి మాటలో, నా నడకలో ఒక గర్వం కనిపించేది అవి మ్యాగజైన్‌లలో పబ్లిష్ అయిన ప్రతిసారి. కానీ నేను రాసిన ఆ కవితలని తలచుకుని, ఇప్పుడు తను చెప్పిన కవితలు వింటుంటే నావి కవితలేనా? అని సిగ్గుపడాలనిపిస్తుంది.

ఈ రోజు నాకు ఒక పండగలా అనిపిస్తుంది. మనసులో ఏదో తృప్తి. నా నాట్యం నన్ను ఎంతగా సంతోషపెట్టేదో, నా వయోలిన్ నన్ను ఎంతటి ప్రశాంతతకు దగ్గర చేసేదో అంతకంటే ఎక్కువ ఆనందాన్ని ఇప్పుడు పొందుతున్న ఫీలింగ్. హృదయం, శరీరం దూది పింజలా గాలిలో తేలుతున్నట్టుంది. ఆరు రోజుల ధారావాహిక తర్వాత తనని నేరుగా కలవటానికి నేను బయలుదేరిన రోజు. తనని ఆశ్చర్యపరచటానికి నేను చేస్తున్న పని తనకి నచ్చుతుందో లేదో, నచ్చకపోతే ఎలా రియాక్ట్ అవ్వాలి? నచ్చితే ఎలా రియాక్ట్ అవ్వాలి? అసలు తనని కలవగానే అతని కళ్ళని నేరుగా నేను చూడగలనా? తన అక్షరమాలని ఒక పుస్తకంగా ముద్రించి ఆ పుస్తకాన్ని తనకి బహుమతిగా ఇవ్వాలనే కోరిక. నేను తీసుకు వెళ్ళాలనుకున్న ఆ బహుమతి అనుకున్న సమయానికి అవుతుందా అన్న భయం.

నేననుకున్న పనిని నాకు చాలా నమ్మకమైన ఒక వ్యక్తి చేతిలో పెట్టి, నాకు ఒక్కరోజులో ఆ పని కావాలి అని ఆంక్ష పెట్టి, పని మొదలు పెట్టించాను. కానీ నిజానికి నేనిచ్చిన సమయం ఒక పుస్తకం ముద్రించటానికి చేయటానికి ఎంత మాత్రమూ సరిపోదు. కానీ నాలో పట్టుదల, ఆత్రుత, త్వరగా తనని చూడాలని కోరిక, అన్నీ కలిపి ఆ పని చేస్తున్న వాళ్ళని నేను పెట్టిన తొందరతో, ఆఖరికి నా ఫ్లయిట్ టైంకి అందిస్తామని వాళ్ళు ఇచ్చిన వాగ్దానంతో నేను ఎయిర్పోర్ట్‌కి బయలుదేరేలా చేసినా, ఎక్కడ ఆ పని జరగదో అని నిమిష నిమిషానికి, ఫోన్ మీద ఫోన్‌లు కొట్టి, క్షణానికి ఒకసారి నా చేతి గడియారాన్ని చూసుకుంటూ, ఆఖరికి, ఆ ఆఖరి క్షణంలో నేను అనుకున్నది నా చేతికి చేరింది.

ఒక కవికి నేను ఏ బహుమతి ఇవ్వగలను? తన కవితలే తనకొక పుస్తకంగా ఇవ్వటమొక వంతైతే, కవికి ఇవ్వగలిగే అపురూపమైన బహుమతి మరొకటి ఉంది. అదే కలం.

నేను ఇవ్వబోయే ఆ కలం ఒక మరిచిపోలేని బహుమతిగా చిరకాలం ఉండిపోవాలి. అలా ఆలోచిస్తున్న నాకు ఎయిర్పోర్ట్ ఎంటర్ కాగానే ఒక పెన్ షాప్ కనిపించింది. ఆలస్యమౌతుంది బోర్డింగ్‌కి అని తెలిసినా అందులో దూరాను. ఒక ఖరీదైన ఫౌంటెన్ పెన్‌ని తనకి బహుమతిగా తీసుకున్నాను. ఇంకా ఏవో తీసుకోవాలి, బహుమతులతో ముంచేయాలనుకున్నాను.

గేట్ నెంబర్ 24కి రీచ్ అయ్యేలోపల ఒక ఇంటర్నేషనల్ బ్రాండ్ రిస్ట్ వాచీల షాప్ కంట్లో పడింది. అంతే, అందంగా రాసే అతని చేతికి నేనొక అలంకారాన్ని అందించాలని నిర్ణయించుకున్నాను. అందమైన రిస్ట్ వాచీ కొనేసాను. కరెక్ట్‌గా నేను బోర్డ్ చేసిన వెంటనే గేట్స్ క్లోజ్, బోర్డింగ్ కంప్లీట్ అని ఎయిర్ హోస్టెస్ అనౌన్స్ చేయటం, చేతిలో ఉన్న బాగ్‌ని నా గుండెలకి గట్టిగా హత్తుకుని మనసులో మొదలైన ఆందోళనతో నేను ఎప్పుడెప్పుడు ఆ ఊరు చేరుకుంటానా, ఎప్పుడెప్పుడు తనని చూస్తానా అని నేను అనుభవించిన అడ్రినల్ రష్ నాకు మాత్రమే తెలుసు. ఆ అనుభవం నా గుండెల్లో ఇంకా ఫ్రెష్‌గానే ఉంది.

చేరిపోయాను, కొన్న వస్తువులు, నేను ఆశపడ్డ ప్యాక్‌ని, పదిలంగా బాగ్‌లో పెట్టి ఎగ్జిట్ గేట్ వైపుగా నడుస్తున్నాను వణుకుతున్న చేతులతో, కంపిస్తున్న హృదయంతో నాలో నేనే కొన్ని వందలసార్లు ప్రాక్టీస్  చేసాను, ఎలా పలకరించాలి? తన పలకరింపుకి ఎలా స్పందించాలి? కళ్ళల్లోకి చూడగలనా? ఏవో ఆలోచనల మత్తు. నా గుండె నిండా నిండిపోయింది. దిక్కులు చూస్తూ తనకై వెతుకుతున్న నా కళ్ళకి, నా కంట్లో నాకే తెలియకుండా పుట్టిన కన్నీళ్ళతో ఒక్కసారిగా చీకటి కమ్మేసింది.

అతను, అతని రెండు చేతులని తెరిచి, హృదయంలోకి ఆహ్వానిస్తూ నా పక్కనే వచ్చి నిలబడి తన గుండెల్లోకి నా తలని సున్నితంగా ఒత్తుకున్నప్పటి ఆ క్షణాలు నా ఊపిరి పోయేవరకూ మరువలేనివి. తన బలమైన చేతులలో కరిగిపోతూ గమ్యాన్ని చేరేవరకూ నాలో నేను లేనని నాకే తెలియదు. గమ్యం చేరిన నాకు, ఆ చిరునవ్వు చూస్తూ ఉండిపోవాలనే ఆశ. అయినా తమాయించుకుని తన చేతికి అందించాను. అదే నేను ఆశపడి ఒక్క రోజులో చేయించినది. అది అతను రాసిన, తనకు మూడురోజులుగా చెప్పిన కవితలు ఒక పుస్తకం రూపంలో..

పుస్తకాన్ని విప్పి చూసిన అతని కంటిలో కనిపించిన కాంతిపుంజం నా ఈ జన్మకి సరిపడిన తృప్తి. మాటలు రాక మౌనంతో పోరాడుతూ, పదాలకై ఆ క్షణంలో అతను పడిన తపన నా ఈ జన్మకి సరిపడిన సార్ధకత.

నేను ఇచ్చిన ఆ బహుమతి అతను ఊహించని అతని కల నిజమైన ఒక క్షణం అని తను చెప్పినప్పుడు నాలోని భావన, ఈ జన్మకిది చాలు అనేంతటి అద్భుతమైన భావన.

24 గంటల సమయం మా ఇద్దరి మధ్యా మౌనంగానే సాగిందని చెపితే ఎవరైనా నమ్ముతారా? కానీ అదే అసలు నిజం. ఆరురోజులుగా సాగిన పదాల ఒరవడికి ఒక్కసారిగా ఆనకట్ట పడినట్లుగా మాలోని ఆనందం మా ఇద్దరిలో పదాలని పరదాతో కప్పేసింది.

నా తిరుగు ప్రయాణానికి సమయం వచ్చేసింది. 24 గంటల తర్వాత అదే మౌనంతో, అదే మనస్థితితో మళ్ళీ ఎయిర్పోర్టుకి వచ్చి ఫ్లైట్ ఎక్కేశాను.

ఫ్లైట్ ఆకాశంలోకి ఎగిరి సముద్రం పైనుండి ప్రయాణిస్తుంది.

కిటికీలోనుండి కిందకి చూస్తూ నా మనసు రాసుకున్న అక్షరాలివే

"సంద్రం హోరెందుకు నీ పేరు పలికినట్టుంది
తీరం తీరెందుకు నీకై కళ్ళాపి చల్లినట్టుంది
అల హారం నీకోసం ఎదురు చూసినట్టుంది
అవతలి తీరాన నా కోసం నువ్వున్నట్టుంది
ఎందుకు ఈ దూరం అని గాలి అడిగినట్టుంది
నా మనసే అన్నిటిలో నాకు కనిపిస్తుంది
పదే పదే మదే నన్ను ప్రశ్నిస్తుంది
నువ్వెందుకు నా పక్కన లేవంటుంది.."

బై

సునేత్ర.

COMMENTS